పల్లెకు పరిశుద్ధ జలం

- గ్రామాల్లో మంచి నీటి ట్యాంకుల శుభ్రతకు ప్రాధాన్యం
- అంటురోగాలు ప్రబలకుండా చర్యలు

చిత్తూరు కార్పొరేషన్/యాదమరి: గ్రామాల్లో స్వచ్ఛమైన నీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా మంచి నీటి ట్యాంకుల శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పండుగల సందర్భాల్లో జలం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం గ్రామ పంచాయతీ సాధారణ నిధులు వినియోగించుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేశారు.

ట్యాంకులు శుభ్రం చేయాల్సిందే

తాగునీరు పరిశుభ్రంగా ఉంటే పలు రోగాలకు దూరంగా ఉండొచ్చు. వేసవిలో గ్రామాల్లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న బావులు, కుంటల్లో నీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. మంచినీటి పైపులైన్లు లీక్ కావడం వల్ల అపరిశుభ్రమైన నీరు సరఫరా కావడం, లీక్ అయిన పైపులను సకాలంలో గుర్తించకపోవడం, ఆయా పైపుల నుంచి సరఫరా అయ్యే నీటినే తాగడం వల్ల గ్రామీణ ప్రజలు అనారోగ్యాలకు గురి కావడం వంటి సంఘటనలు జరిగే ప్రమాదం ఉంది. వీటిని నివారించడానికి, రక్షిత మంచి నీటిని అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జిల్లాలోని ఏ గ్రామంలో కూడా కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు చేపడుతోంది. ప్రతి నెలా 2, 17 తేదీల్లో తప్పనిసరిగా ఆయా గ్రామ పంచాయతీల్లోని ఓహెచ్‌ఎస్‌ఆర్, జీఎస్‌ఎల్‌ఆర్ ట్యాంకులనును శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని 697 గ్రామ పంచాయతీల్లో ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికార యంత్రాంగం

జిల్లాలోని పంచాయతీలు	-	697
ఓహెచ్‌ఆర్ ట్యాంకులు	-	2886
ఓఎస్‌ఎల్‌ఆర్ ట్యాంకులు	-	699
సిస్టర్న్‌లు	-	1500

సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రామాల్లో ప్రత్యేక చర్యలు

గ్రామ పంచాయతీ పరిధిలోని నీటి వనరులు, పైప్‌లైన్లను తనిఖీలు చేయడంతోపాటు లీకేజీలు వెంటనే అరికట్టాల్సి ఉంది. మంచినీటి సరఫరా చేసే పైప్‌లైన్లలో ఎక్కడైనా మురుగునీరు కలుస్తోందా? లేదా? అని గుర్తించాలి. ప్రతి 15 రోజులకోసారి ఉపరితల, భూగర్భ నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నీటి ట్యాంకులను నింపిన ప్రతిసారి తప్పకుండా నిర్దిష్ట ప్రమాణంలో క్లోరినేషన్ చేయాలి. కుంటల్లో నిల్వ ఉన్న నీటిని తాగరాదని గ్రామాల్లో దండోరా వేయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామాల్లోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు, రక్షిత మంచినీటిని అందించేందుకు యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల్లోని నీటి ట్యాంకులను,

రూ.3.30 కోట్లు నిధులు

గ్రామ పంచాయతీల్లో పన్నులు, పన్నేతరములు కింద ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి రూ. కోట్లు వసూలయ్యాయి. ఇందులో నుంచి గ్రామ పంచాయతీ సాధారణ నిధుల కింద రూ.3.30 కోట్లను పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు, రక్షిత మంచినీటిని అందించేందుకు వినియోగించనున్నార


వేల్కూరు పంచాయతీలో వాటర్ ట్యాంకు శుభ్రం చేస్తున్న కార్మికుడు

డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు.

జాతరలో జాగ్రత్తలు

వేసవి కాలంలో రాయలసీమలోని గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా జాతర్లు, ఉరుసులు వంటివి జరుగుతుంటాయి. ఇలాంటి వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతుంటారు. ఈ సమయంలోనే నీటి వినియోగం అధికంగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో లభ్యమయ్యే నీరు కలుషితమైన ప్రజలు రోగాల బారిన పడుతుంటారు. ఆయా ప్రాంతాలో పారిశుద్ధ్య సమస్య అధికంగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయి అధికారులు, సర్పంచులు జాతర, ఉరుసు వేడుకల్లో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

శుభ్రతకు ప్రాధాన్యం



పల్లెల్లో నీటి శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి నెలా 2–5 లోగా, 17–20 తేదీలోగా నీటి ట్యాంకులను తప్పకుండా శుభ్రంగా చేయాల్సి ఉంది. ఈ మేరకు క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. నీటిని క్లోరినేషన్ చేయిస్తున్నాం. నీటి ట్యాంకులను తప్పకుండా శుభ్రం చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ఈఓఆర్‌డీ, కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం.

- లక్ష్మి, డీపీఓ, చిత్తూరు

క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో గంగమ్మ నిమజ్జనం


నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న అమ్మవారు

యాదమరి: మండలంలోని పెరుమాళ్ల పల్లెలో తిరుపతి గంగమ్మను భక్తి శ్రద్ధలతో బుధవారం రాత్రి నిమజ్జనం నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహించిన గంగమ్మ జాతరలో బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మధాహ్నాం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారిని రథంలో కొలువుదీర్చి ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

వన్‌టౌన్ సీఐగా భాస్కర్



చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్‌టౌన్ సీఐగా భాస్కర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న నరసింహరాజు కర్నూలుకు బదిలీపై వెళ్లడంతో.. ఆ స్థానంలో చిత్తూరు సీసీఎస్‌లో పనిచేస్తున్న భాస్కర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీంతో భాస్కర్ వన్‌టౌన్‌లో బాధ్యతలు తీసుకున్నారు.

ప్రైవేటీకరణను రద్దు చేయండి

చిత్తూరు అగ్రికల్చర్: క్వారీల నిర్వహణలో సీనరైజ్ వసూళ్లను, ప్రైవేటీకరణ విధానాన్ని రద్దు చేయాలని క్వారీల నిర్వాహకులు డిమాండ్ చేశారు. స్థానిక భూగర్భ గనుల శాఖ డీడీ కార్యాలయంలో బుధవారం క్వారీల యజమానులు ఆందోళన చేపట్టారు. క్వారీల ద్వారా తరలించే గ్రానైట్‌కు సీనరైజ్ వసూళ్లను ప్రైవేటీకరణ చేపట్టినందున తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అనంతరం వారు వినతి పత్రాన్ని భూగర్భ గనులశాఖ డీడీ ప్రసాద్‌కు వారు అందజేశారు.

సియోన్‌మలై ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు


ఉత్సవాలకు ముస్తాబవుతున్న సియోన్‌మలై

గుడిపాల: ప్రతి ఏటా మే లో జరిగే సియోన్‌మలై ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యదర్శి కరుణాజాన్ బుధవారం మీడియాకు తెలిపారు. మండలంలోని నంగమంగళం సమీపంలో గల సియోన్‌మలైలో మే 12 నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక నుంచి ఎక్కువ సంఖ్యలో క్రైస్తవ భక్తులు ఇక్కడకు చేరుకుంటారు. తొలిరోజు వేలూరు డయాసిస్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలకు ప్రారంభోత్సవం చేస్తారు. రెండో రోజు పాస్టర్లు ఉపన్యాసాలు, మూడో రోజు పలు రకాల వేడుకలను నిర్వహిస్తారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు వారు తెలిపారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్ ఎంట్రన్స్


పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద పాలిసెట్‌కు హాజరైన విద్యార్థులు

పలమనేరు: పలమనేరులో బుధవారం జరిగిన పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ ప్రశాంతంగా జరిగిందని పాలిసెట్ కోఆర్డినేటర్ మహమూద్ తెలిపారు. పట్టణంలోని ఐదు సెంటర్లలో జరిగిన ఈ పరీక్షకు 1,934మంది హాజరు కావాల్సి ఉండగా వీరిలో 1,664 మంది పరీక్ష రాసినట్లు తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష జరిగేలా చూసిన సంబంధిత సెంటర్ల నిర్వాహకులు, పోలీసు, రెవెన్యూ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కుప్పంలో..

కుప్పం: పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో పాలిసెట్ ప్రవేశ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. 553 మంది దరఖాస్తు చేసుకోగా, 486 మంది విద్యార్థులు హాజరయ్యారు.

నేటి నుంచి మహాభారత యజ్ఞం

గుడిపాల: మండలంలోని కమ్మతిమ్మాపల్లెలో గురువారం నుంచి మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్లు కమ్మతిమ్మాపల్లె గ్రామస్తులు తెలిపారు. 11 నుంచి 29వ తేదీ వరకు ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి దేవస్థానంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. 11వ తేదీ నుంచి 29వ తేదీ వరకు మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు భాగవతారిణి వనజశ్రీ హరికథ ఉంటుందని చెప్పారు.

చెరువులు అభివృద్ధి చేయడమే లక్ష్యం


భూమిపూజ చేస్తున్న పీడీ గంగాభవాని, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

గుడిపాల: చెరువులను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఉపాధిహామీ ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని తెలిపారు. మండలంలోని పెరుమాళ్లకుప్పంలో ఉన్న చెరువును అభివృద్ధి చేసేందుకు ఆమె బుధవారం ఎంపీపీ ప్రసాద్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. పీడీ మాట్లాడుతూ చెరువుకట్టను మరమ్మతులు చేయడంతోపాటు చెరువులో పూడికతీత పనులను చేపట్టనున్నట్లు వివరించారు. దీనివల్ల చెరువులు నిండినప్పుడు నీటి సమస్య రాకుండా ఉంటుందని ఆమె తెలియజేశారు. కూలీలకు పనులు కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో యువత అధ్యక్షుడు శిలంబరసన్, జేఈ మధు, టీఏలు సుందరేష్, హంసవేణి, చంద్రప్రకాష్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పూర్ణిమ, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దుర్యోధన వధ


పాండవుల విగ్రహాలను తీసుకొస్తున్న ఆలయ నిర్వాహకులు

యాదమరి: మండలంలోని లక్ష్మయ్య కండ్రిగ గ్రామంలో వెలసిన ద్రౌపది ధర్మరాజుల ఆలయం వద్ద వేడుకగా దుర్యోధన వధ వేడుకగా నిర్వహించారు. మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ద్రౌపదీ ధర్మరాజులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో దుర్యోధనుడి రూపంలో మట్టితో ప్రతిమను ఏర్పాటు చేసిన చోట పాండవుల విగ్రహాలను కొలువు దీర్చారు. భీమ, దుర్యోధన గీతాలు ఆలపిస్తూ దుర్యోధన వధ ఘట్టం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పూల సుబ్రమణ్యం, గౌరవ అధ్యక్షులు కుమారస్వామి నాయుడు, ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

పాత కలెక్టరేట్లో తహసీల్దార్ కార్యాలయం?

చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి సరిపడే భవనం కోసం అన్వేషణలో భాగంగా అధికారులు పాత కలెక్టరేట్‌లో ఓ నిర్మాణాన్ని గుర్తించారు. తహసీల్దార్ కిరణ్ తన బృందంతో కలిసి బుధవారం చిత్తూరు నగరం పాత కలెక్టరేట్‌లోని మైనింగ్ కార్యాలయ భవనాన్ని చూశారు. ఈ భవనం బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని అర్బన్ ప్రాంతానికి కేటాయించనున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో పంపిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు


సవటపల్లెలో పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని పొలకల–1 సచివాలయం పరిధిలోని గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే 645 కుటుంబాలను కలిసి పలకరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధిని తెలియజేసే సంక్షేమ బావుటాను అందజేశారు. ఆయా గ్రామస్తులు సమస్యలను ఎమ్మెల్యేకు నివేదించారు. సంబంధిత సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ఎంఎస్ బాబు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా, అవినీతికి తావు లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని చెప్పారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలనే ఉద్దేశంతోనే జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. సంక్షేమ ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఇంకా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, తహసీల్దార్ సుశీలమ్మ, ఎంపీడీఓ నిర్మలాదేవి పాల్గొన్నారు.

కార్యదర్శుల కాలక్షేపం

- చిత్తూరు మండలంలో ఓ పంచాయతీ కార్యదర్శి ఉదయం మాత్రమే హాజరు వేస్తున్నారు. మధ్యాహ్నం గంట మోగితే, మండల ఆఫీసులో మీటింగ్ ఉందని, ఆ సార్ పిలుస్తున్నారని, వీసీ ఉందని, ఇలా ఏవో కారణాలు చెప్పి, మండల కార్యాలయానికి చేరుకుంటున్నారు. అక్కడ సాయంత్రం వరకు కాలక్షేపం చేసి ఇంటికెళుతున్నారు.
- యాదమరి మండలంలో ఓ పంచాయతీ మహిళా కార్యదర్శి రెండు క్యాష్‌బుక్‌లు నిర్వహిస్తున్నారు. ఒక క్యాష్‌బుక్‌లో అసలైన లెక్కలు, మరో బుక్‌లో వారికి కావలసినట్లుగా లెక్కలు కనిపిస్తున్నాయి. సర్పంచులకు, మండల అధికారులకే తెలియకుండా ఇలాంటి క్యాష్‌బుక్‌లు నిర్వహిస్తున్నారు.

- క్యాష్‌బుక్‌ల నిర్వహణలో గోల్‌మాల్
- విధులకు ఇష్టారాజ్యంగా డుమ్మా
- పల్లెబాట పట్టని వైనం



పూతలపట్టు/యాదమరి : జిల్లాలో కొందరు పంచాయతీ కార్యదర్శులు క్యాష్‌బుక్‌ల నిర్వహణలో గోల్‌మాల్ చేస్తున్నారు. పంచాయతీ క్యాష్‌బుక్‌ల పేరుతో బురిడీ కొట్టిస్తున్నారు. విధులకు డుమ్మా కొడుతూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఉదయం నుంచి ఓ గంట పాటు పంచాయతీల్లో ఉండే కార్యదర్శులు మధ్యాహ్నం అయితే మండల కార్యాలయాలకు చేరకుంటున్నారు. పల్లెబాట పట్టకుండా కార్యాలయాల్లో కాలక్షేపం చేస్తున్నారు. ఇది తెలిసినా ఉన్నతాధికారులు బోద్యం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో 31 మండలాల పరిధిలో 612 సచివాలయాలున్నాయి. 697 పంచాయతీలు, 11మేజర్‌కు పంచాయతీలకు గాను 676 మంది పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. వీరిలో 612 మంది డీడీఓలు వ్యవహరిస్తున్నారు. పంచాయతీల్లో కొందరి పెత్తనం పెచ్చుమీరుతోంది. వీరు ఆడిందే ఆటగా పాడిందే పాట సాగుతోంది.

క్యాష్‌బుక్‌ల కిరికిరి

పంచాయతీల ఆదాయం, ఖర్చులను క్యాష్‌బుక్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. ఆన్‌లైన్‌లో పెట్టాలి. కొందరు డీడీఓలు అలా చేయడం లేదు. సర్పంచులు, అధికారులు తెలియకుండా రెండేసి క్యాష్‌బుక్‌లు నిర్వర్తిస్తున్నారు. దీని వల్ల పంచాయతీ ఆదాయ వనరులు పక్కాదారిపడుతున్నాయి. ఇక కొన్ని పంచాయతీ క్యాష్‌బుక్‌లను డీడీఓలో బీరువాలో పెట్టి లాక్ చేసుకుపోతున్నారు. సచివాలయ కార్యదర్శులకు ఇవ్వడం లేదు. ఇస్తే అసలు రంగు బయటపడుతుందని దాచిపెడుతున్నారు. ఈ విషయం తెలిసిన సర్పంచులు నోరు మెదపడం లేదు.

పనివేళలో కానరారు

పంచాయతీ కార్యదర్శులు ఉదయం 10 గంటలకు హాజరు వేయాలి. అయితే చాలా మంది 11 గంటలకు కూడా సచివాలయాలకు చేరుకోవడం లేదు. సాయంత్రం 5 గంటలకు అవుట్ అటెండెన్స్ విధిగా వేయాల్సి ఉంటుంది. కానీ కొందరు పంచాయతీ కార్యదర్శులు మధ్యాహ్ననికే వెళ్లిపోతునానరు. మరి కొందరు మీటింగ్‌లు, వీసీలు, మండల కార్యాలయంలో పని ఉందంటూ, రకరకాల సాకులతో సచివాలయాల నుంచి మెల్లగా జారుకుంటున్నారు. కొందరు ఇంటికి వెళ్లిపోతే..మరి కొందరు మండల కేంద్రానికి వచ్చి సొంత పనులు చూసుకుంటున్నారు. ఇక వచ్చిన కొంత మంది కార్యాలయంలో కాలక్షేపం చేస్తున్నారు. తోచినప్పుడు బయోమెట్రిక్ వేసి వెళ్లిపోతున్నారు. పల్లె సమస్యలను పట్టించుకోవడం లేదు.

అందుబాటులో ఉండాల్సిందే

పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో లేకపోతే చర్యలు తప్పవు. పలు చోట్ల కార్యదర్శులు ఉండడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై నిఘా పెట్టాలని ఎంపీడీఓలకు చెప్పాం. కార్యదర్శులు రెండు క్యాష్ పుస్తకాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. తప్పులు జరిగినట్లు సర్పంచ్‌లు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం. క్యాష్ పుస్తకాలు డీడీఓలు దగ్గరే దాచిపెట్టుకున్నా చర్యలు తప్పవు

-లక్ష్మీ, డీపీఓ, చిత్తూరు

ఆర్టీసీ టూరిస్ట్ బస్సులను వినియోగించుకోండి

పుంగనూరు: మదనపల్లె రెండవ డిపో నుంచి వేసవి సెలవులకు టూరిస్ట్ బస్సులను ప్రారంభిస్తున్నట్లు డీఎం నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉద్యోగస్తులు, విద్యార్థులకు అనుకూలంగా ఉండేందుకు ఈనెల 12, 13, 14, 15 తేదీల్లో ఊటీ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. రానుపోను టికెట్ ధర రూ.2,250లని తెలిపారు. ఆసక్తి గల వారు మదనపల్లె అసిస్టెంట్ మేనేజర్ ఆర్.గీత సెల్ నంబర్ 9160186645కు సంప్రదించి సీట్లు రిజర్వ్ చేసుకోవాలన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తులు


పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ కోరారు. కళాశాల ఆవరణలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఏ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ కోర్సులలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో సంప్రదించి, అడ్మిషన్లు పొందాలని ఆయన కోరారు.


కారు దిగితే ఒట్టు!


చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని కలెక్టరేట్ కార్యాలయం పక్కన ఓ ఎంవీఐ కారులో కూర్చుని వాహన చోదకులను తన వద్దకు పిలిపించుకుని రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీల సమయంలో డ్రైవర్లు రెండు చేతులు కట్టుకొని, చెప్పులు పక్కకు తీసి మరి నిల్చోవాలి. ఇక ఎంవీఐ డ్రైవర్ అయితే వాహన చోదకులను బెదిరించడం, రికార్డులను తనిఖీ చేయడం చేస్తున్నాడు. రవాణా శాఖలో ఇంకా జమిందారీపాలన నడుస్తున్నట్లు వారు వ్యవహరిస్తున్నారు. దీనిపై డీటీసీ నిరంజన్‌రెడ్డి వివరణ కోరగా, 'తాను దీనిపై దృష్టి పెడతాను. తాను బాధ్యతలు స్వీకరించిన రోజే..వాహనదారులతో ఎలా ఉండాలో చెప్పాను. మళ్లీ కూడా వాహనాల తనిఖీ విషయంలో ఏ రకంగా ప్రవర్తించాలో చెబుతాను. ప్రైవేటు వ్యక్తులు బండి ఆపితే చర్యలు తీవ్రంగా ఉంటాయి.'అని పేర్కొన్నారు.



పేదలకు వరం ఫ్యామిలీ ఫిజీషియన్


పూతలపట్టు: చికిత్స అందిస్తున్న డాక్టర్ ప్రియాంక


ఐరాల : పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్


తవణంపల్లె: వైద్య సేవలందిస్తున్న వినయ్‌కుమార్

తవణంపల్లె: ఫ్యామిలీ ఫిజీషియన్ పేదలకు వరం లాంటిదని మండల వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కృష్ణాపురంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భవతులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించారు. ప్రభుత్వం ఇంటి ముంగిటకే వైద్య సేవలందిస్తున్నదని వివరించారు. ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, చాముండేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోత్స్న, ఆశా వర్కర్లు ద్రాక్షాయణి, అలివేలు, సావిత్రి, రేణు క, డేటా ఎంట్రీ ఆపరేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

వావిల్‌తోటలో ..

పూతలపట్టు: మండలంలోని వావిల్‌తోట పంచాయతీలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని డాక్టర్ ప్రియంక నిర్వహించారు. బాలింతలకు, గర్భిణులకు, రోగులకు ఉచిత చికిత్స నిర్వహించారు. 57 మందికి రక్త పరీక్షలు చేసి హిమోగ్లోబిన్ శాతం పెరగడానికి మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, అశ్వని, దీన, ఆశా వర్కర్లు, రెజీనా పాల్గొన్నారు.

వేదగిరివారిపల్లెలో..

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో బుధవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.